క్లుప్తంగా

ముమ్మరంగా సీసీరోడ్ల పనులు


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు

నారాయణఖేడ్: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో సీసీ రోడ్ల నిర్మాణం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 4, 9వ వార్డుల్లో పనులను ఆదివారం ప్రారంభించారు. మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, కౌన్సిలర్లు రాజేష్ చౌహాన్, నర్సింహులు పనులను పరిశీలించారు. నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు.

లక్ష జపయజ్ఞం కరపత్రం ఆవిష్కరణ


కరపత్రం ఆవిష్కరిస్తున్న గిరిమహరాజ్, రాజు

సదాశివపేట(సంగారెడ్డి): శ్రీశైలంలో జరగనున్న శ్రీనరసింహ సరస్వతీ స్వాములు శోభాయాత్ర 'మహామృత్యుంజయ లక్ష జపయజ్ఞం' కరపత్రం ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులిమామిడి రాజు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరిమహరాజ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పులి మామిడిరాజు, మమత, మనోజ్, శ్రీశైలం, వీరేష్, అనిల్, అనంద్, రాము, అఖిల్, సోమశంకర్ పాల్గొన్నారు.

ఇంటర్ ఓపెన్ తరగతులు ప్రారంభం


తరగతులు ప్రారంభిస్తున్న ఎంఈఓ, శ్రీనివాస్

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్‌లో ఇంటర్ ఓపెన్ తరగతులు ఆదివారం ప్రారంభించారు. ఓపెన్ స్టడీ సెంటర్‌లో ఎంఈఓ, కోఆర్డినేటర్ నాగరం శ్రీనివాస్ తరగతులు ప్రారంభించారు. ఓపెన్ ఎస్ఎస్‌సీలో 50 మంది, ఇంటర్‌లో 50 మంది అడ్మిషన్ పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది మారుతి, సీఆర్‌పీ శివకుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: మండలంలోని సత్తెగామ గ్రామానికి చెందిన పుప్పాల రామయ్యకు సీఎం సహాయనిధి నుంచి రూ.27 వేలు మంజూరయ్యాయి. సంబంధించిన చెక్కును ఆదివారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. తాజా మాజీ సర్పంచ్ వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు రాజిరెడ్డి, సాయిరెడ్డి, అంజయ్య, గైని నాగయ్య, మల్లయ్య, రాజు పాల్గొన్నారు.

మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్‌కు సత్కారం


అనిల్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జహీరాబాద్: జహీరాబాద్‌కు వచ్చిన మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ అనిల్‌ను కాంగ్రెస్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆదివారం పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయనను నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా శాలువాలతో సత్కరించారు.

14న ఖేడ్‌లో మహా భోగ్‌భండార్

నారాయణఖేడ్: సంత్ సేవాలాల్ మహరాజ్ 286వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 14న ఖేడ్ తహసీల్ గ్రౌండ్‌లో మహా భోగ్‌భండార్ నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ తెలిపారు. ఉ. 11 గంటలకు మంగల్‌పేట్ దుర్గాభవాని మాత ఆలయం నుంచి సేవాలాల్ చౌక్, బసవేశ్వర చౌక్, రాజీవ్ చౌక్‌ల మీదుగా తహసీల్ గ్రౌండ్ వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు.

ఆరుతడి.. భలే దిగుబడి

- బోరుబావుల వద్ద వరిసాగుకు రైతన్నల ఆసక్తి
- ఆరుతడి పంటలుగా జొన్న, మొక్కజొన్న


కల్హేర్ మండలం మార్డి శివారులో సాగు చేసిన జొన్న పంట

కల్హేర్(నారాయణఖేడ్): జిల్లాలోని మధ్యతరహా ప్రాజెక్టు నల్లవాగు ఆయకట్టు కింద యాసంగి పంటల సాగుతో పచ్చదనం పరుచుకుంది. వానాకాలంలో కురిసిన వర్షాలకు నల్లవాగు ప్రాజెక్టులో నీరు చేరింది. దీంతో ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. బోరు బావుల సౌకర్యం ఉన్న రైతులు వరి సాగుకే మొగ్గు చూపుతున్నారు. నల్లవాగు ప్రాజెక్టు ఆయకట్టు కింద 4,100 ఎకరాలు ఆరుతడి పంటలు సాగు చేస్తున్నారు. ప్రాజెక్టు కుడికాల్వ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి, పోచాపూర్, బీబీపేట, మార్డి, ఖానాపూర్(కె) వరకు 2,989 ఎకరాలు, ఎడమ కాల్వ పరిధిలోని బోక్కస్‌గాం, అంతర్‌గాం, కామారెడ్డి జిల్లా మార్దండ, తిమ్మానగర్ గ్రామాల వరకు 1100 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు చేశారు. ఎమర్జెన్సీ కెనాల్ పరిధిలో సుల్తానాబాద్, గోసాయిపల్లి సమీపంలో 60 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. పంటల చివరి దశలో నీటి కొరత ఏర్పడితే ఇబ్బందులు పడకుండా ముందు జాగ్రత్తగా ఆరుతడి పంటలే వేయాలని అధికారులు సూచించారు. ఈ నేపథ్యంలో ఆరుతడి పంటలుగా మొక్కజొన్న, జొన్న సాగు చేస్తున్నారు. కొద్దిపాటిగా శనగ, వేరుశనగ, పొద్దుతిరుగుడు, తదితర పంటలు సాగులో ఉన్నాయి.

జొన్న, మొక్కజొన్న కూడా..

ఏటా యాసంగిలో రైతులు వరి తర్వాత ఆరుతడి పంటలు జొన్న, మొక్కజొన్న సాగుకు ప్రాధాన్యం ఇస్తారు. ఈ పంటకు మూడు నుంచి నాలుగు తడులు నీటీ సరఫరా సరిపోతుంది. క్వింటా జొన్నలకు రూ. 2,600, మొక్కజొన్నకు రూ. 2,000పైగా మద్దతు ధర లభించడంతో రైతులు వీటి వైపు మొగ్గు చూపుతున్నారు.

జొన్నసాగు బాగుంది



యాసంగిలో జొన్న సాగు చేసేందుకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చాం. నల్లవాగు ప్రాజెక్టు నుంచి నీరు విడుదల చేయడంతో ఆయకట్టు కింద ఉన్నా 20 ఎకరాల్లో జొన్న సాగు దశలో ఉంది. నల్లవాగు ప్రాజెక్టు నుంచి ఇప్పటికే రెండు తడులు నీరు అందింది. మరో రెండు తడులు నీరు అందితే పంట చేతికోస్తుంది.

– వైసంగారెడ్డి, మార్డి, కల్హేర్ మండలం

సూచనలు పాటించాలి

వరి, జొన్న సాగులో తెగుళ్ల నివారణ చర్యలు చేపట్టాలి. జొన్నలో రసం పీల్చే పురుగు, మొగి పురుగు బెడదను నియంత్రించాలి. పంట సాగు కోసం కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలి. తెగుళ్ల, ఇతర సమస్యలు వస్తే అధికారులు, శాస్త్రవేత్తలను సంప్రదించాలి. వారి సూచన మేరకే మందులు వాడితే బాగుంటుంది.

– నూతన్‌కుమార్, ఏడీఏ, నారాయణఖేడ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

రామచంద్రాపురం (పటాన్‌చెరు): భద్రత నియమాలు, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తెలంగాణ, నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ చైర్మన్ తెలంగాణ చాప్టర్ రాజగోపాల్ రావు అన్నారు. ఆదివారం బీహెచ్ఈఎల్ కమ్యూనిటీ సెంటర్‌లో పర్యావరణ పరిరక్షణ, గృహిణీల భద్రతపై నిర్వహించిన చిత్రలేఖన, వ్యాసరచన పోటీల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి చిన్నారులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలన్నారు. ఇలాంటి పోటీలు నిర్వహించడం వల్ల వారిలోని ప్రతిభను బయటకు తీసిన వారమవుతామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేసినప్పుడే భవిష్యత్ తరాలకు మంచి వాతావరణం ఇవ్వగలమని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ భద్రత కౌన్సిల్ కోశాధికారి సత్యబాబు, అధికారులు గౌరీశంకర్, భెల్ అధికారులు ప్రవీణ్ కుమార్, శ్రీనివాసరావు, విజయసాగర్, అరవింద్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


చిత్రలేఖన పోటీలో పాల్గొన్న చిన్నారులు

భవిష్యత్ తరాలకు స్ఫూర్తి పండుగ సాయన్న

కాంగ్రెస్ నేత నీలం మధు


విగ్రహావిష్కరణలో పాల్గొన్న నీలం మధు

పటాన్‌చెరు: దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడి ఆకలితో అల్లాడుతున్న పేదల కడుపు నింపిన పోరాటయోధుడు పండుగ సాయన్న అని కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గం ఫరూక్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామంలో పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆకలితో అలమటించకూడదని భూస్వాముల నుంచి ఆహార ధాన్యాలు దోచి పేద ప్రజల కడుపు నింపిన మహనీయుడు పండుగ సాయన్న అని కొనియాడారు. గ్రామాల్లో పండుగ సాయన్న అడుగు పెడితే వారి కడుపు నింపి పండుగ వాతావరణాన్ని తీసుకొచ్చిన ఘనత వల్లే సాయన్నకు పండుగ సాయన్న అని పేరు వచ్చిందన్నారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాబయ్య, గణేష్, వెంకటేష్, మత్స్యకారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకుంటున్నారని కాంగ్రెస్ నేత నీలం మధు అన్నారు. షాద్‌నగర్ నందిగామ మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ, బీసీ కులగణన అసెంబ్లీలో ఆమోదం పొందిన సందర్భంగా ర్యాలీ నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. సంబరాల్లో ఎమ్మెల్యే శంకర్, మధు హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. మాదిగ సోదరుల చిరకాల డిమాండు ఎస్సీ వర్గీకరణ.. బీసీలకు రాజకీయంగా లబ్ధి కోసం కులగణన మరో వైపు నిర్వహించి సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మరోసారి రుజువైందన్నారు. బీసీ కులగణన సర్వేలో కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు ఎందుకు పాల్గొనలేదని ప్రశ్నించారు.

ఘనంగా శివస్వాముల పడిపూజ


మెట్ల పూజ నిర్వహిస్తున్న శివస్వాములు


సదాశివపేట పట్టణంలో..

జహీరాబాద్: పట్టణంలోని శాంతినగర్‌లో శివస్వాముల పడిపూజ ఘనంగా నిర్వహించారు. ఆదివారం శ్రీనివాస్‌స్వామి ఆధ్వర్యంలో జరిగిన పన్నెండు మెట్ల పూజను భక్తిశ్రద్ధలతో వైభవంగా చేశారు. కార్యక్రమంలో శివస్వాములు పాల్గొన్నారు.

పంచముఖి హనుమాన్ మందిరంలో..


సదాశివపేట(సంగారెడ్డి): పట్టణంలోని హనుమాన్ నగర్ కాలనీ పంచముఖి హనుమాన్ మందిరంలో ఆదివారం ద్వాదశ జ్యోతిర్లింగ శివమహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం రుద్రాభిషేకం, లింగష్టకం, మధ్యాహ్నం 12 గంటలకు 12 మెట్లకు శివస్వాములు జ్యోతి వెలిగించారు. పడిపూజకు శివస్వాములు భారీగా హాజరయ్యారు. కార్యక్రమంలో గురుస్వాములు హనుమాన్, సురేష్, యాదగిరి, సతీష్‌కుమార్, శేఖర్, సంగమేష్, శ్రీకాంత్, అనిల్, గంగాధర్, నవీన్, భక్తులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: మంజీరా క్యాంపస్‌లోని రామలింగేశ్వర దేవస్థానంలో సోమవారం ఉదయం స్వామివారికి శివస్వాములు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారంలో మల్లికార్జున స్వామి జాతర ఉత్సవాలు మూడో రోజు ఆదివారం ఆలయ ధర్మకర్తలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చంద్రారెడ్డి మాట్లాడుతూ.. మల్లన్న స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. కల్యాణంలో పోతురాజుల విన్యాసాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు మాధవరెడ్డి, హనుమంత్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, ఆదిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణంలో పాల్గొన్న చంద్రారెడ్డి దంపతులు

నేడు సమన్వయ సమావేశం

మునిపల్లి(అందోల్): ఈ నెల 10 ఉ. 9 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరినందన్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు ఉపాధి హామీ పథకంలో కూలీలు కాల్వలు, రోడ్లు, పశువుల పాకలు, హార్టికల్చర్ ప్లాంటేషన్, ఇంకుడు గుంతలు తదితర పనులు నిర్వహించారని తెలిపారు. ఈ పనులకు రూ. 7,75, 71.295 రూపాయల ఖర్చు అయిందన్నారు. పనులు ఎక్కడెక్కడ జరిగాయనే వివరాలను తెలుసుకునేందుకు సమాజిక తనిఖీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు.

బైక్‌పై కుంభమేళాకు..


బైక్‌పై ప్రయాణం చేసిన యువకులు

జహీరాబాద్: పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఇద్దరు యువకులు బైక్ ప్రయోగ్‌రాజ్ కుంభమేళాకు వెళ్లి పుణ్యస్నానం అచరించి, శివుడిని దర్శించుకున్నారు. ఆదివారం యువకులు సుదర్శన్, శ్రీహరి యాత్రను ముగించుకుని జహీరాబాద్ చేరుకున్నారు. ఈ సందర్భంగా మిత్రులు, ఆత్మీయులు ఘనంగా స్వాగతం చెప్పారు. ప్రయోగ్‌రాజ్‌తో పాటు కాశీని దర్శించుకుని వచ్చినట్లు తెలిపారు. 1200 కిలో మేర రాను పోను 24 వందల కిలోమీటర్లు ప్రయాణం సాగినట్లు వివరించారు.

ఆదర్శప్రాయుడు సేవలాల్ మహరాజ్


టోర్నీని ప్రారంభిస్తున్న రమేష్‌చౌహాన్

కల్హేర్(నారాయణఖేడ్): గిరిజన యువత సేవలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బంజారా సేవలాల్ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ పిలుపునిచ్చారు. ఆదివారం సిర్గాపూర్‌లో సేవలాల్ జయంతి ఉత్సవాల నేపథ్యంలో వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సందర్భంగా ఎంఈఓ శ్రీనివాస్ మాట్లాడుతూ.. క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ క్రీడలను అలవర్చుకోవాలన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రావు, నర్స గౌడ్, పీఈటీ విఠల్, గణేష్ పాల్గొన్నారు.

పోరాటాలు కనిపించవా!

సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజయ్య

జిన్నారం (పటాన్‌చెరు): గత వారం రోజుల నుంచి దంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా ప్యారానగర్ ప్రజలతో కలిసి గుమ్మడిదల మండల ప్రజలు స్వచ్ఛందంగా పోరాటాలు చేస్తున్నా.. ప్రభుత్వానికి కనిపించవా అని సీపీఎం జిల్లా కార్యదర్శి రాజయ్య ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలు చేసే పోరాటాలు పాలకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్రజల అభిష్టాలకు వ్యతిరేకంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని తీవ్రంగా మండిపడ్డారు. పీసీబీ, ఫారెస్ట్ అధికారులు ఎక్కడ నిద్రపోతున్నారని మండిపడ్డారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం

ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు టౌన్: దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్‌లోని మహదేవుడి ఆలయంలో వంటశాల షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రతాప్‌గౌడ్, కొమర గూడెం వెంకటేశ్, మల్లేశ్‌యాదవ్, సంతోష్‌గౌడ్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఆలయ కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు

పటాన్‌చెరు టౌన్: డివిజన్ పరిధిలోని శ్రీవాణి హైస్కూల్ (2000–2001) బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. 24 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

ఉత్సాహంగా ఆత్మీయ సమ్మేళనం

రాయికోడ్(అందోల్): చదువు, క్రమశిక్షణతోనే విద్యార్థుల భవిష్యత్ ఉన్నత స్థాయి చేరుతోందని ఎంఈఓ అంజయ్య అన్నారు. రాయికోడ్ ప్రభుత్వ పాఠశాలలో 2004–2005 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అనాటి ఉపాధ్యాయులను పూలతో స్వాగతం పలికారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకొని సంతోష పడ్డారు. కార్యక్రమంలో ఎంఈఓ అంజయ్య, ఉపాధ్యాయులు సంగమేశ్వర్ యాదవ్, రాజశేఖర్, శ్రీనివాస్, నర్సింగ్ రావు, శ్రీనివాస్ గౌడ్, సునంద, జహీరాబాద్‌లోని మాధవి హాస్పిటల్ డాక్టర్ చంద్రశేఖర్, పూర్వ విద్యార్థులు ఉన్నారు.


రాయికోడ్ : సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రోడ్డు పనులు ప్రారంభించండి


గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పటాన్‌చెరు టౌన్: బొంబాయి హైవే నుంచి చందానగర్ మీదుగా.. రెడ్డికాలనీ, బంధం కొమ్ము నుంచి అమీన్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారి పనులను పునః ప్రారంభించాలని సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు నర్సింహారెడ్డి, పాండు రంగారెడ్డి మాట్లాడుతూ.. అమీన్‌పూర్ మున్సిపల్ కేంద్రం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. గత నాలుగు సంవత్సరాలుగా రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. రోడ్డు పనులు చేపట్టకుంటే కాలనీవాసులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జార్జ్, వీరస్వామి అనంత రావు, శ్రీనివాసరెడ్డి, మణిరాజు, సునీత, ప్రజలు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయండి

ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప

సదాశివపేట(సంగారెడ్డి): సెకండ్ ఏఎన్‌ఎంలను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ మండల కార్యదర్శి శంకరప్ప డిమాండ్ చేశారు. ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలకు ప్రభుత్వం పూర్తి వేతనం చెల్లించడంతో పాటు లైఫ్ ఇన్సూరెన్స్, లైఫ్ టైం గ్రాట్యుటీ ఇవ్వాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రులు, గ్రామాల్లో పనిచేస్తున్న ఆశావర్కర్లకు ప్రతి నెల 1న వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు వినోద, ముస్తఫా, పూలమ్మ, శంకరమ్మ, తస్లీమ్, రాజమ్మ, మునీరా, ఫర్జానా, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న శంకరప్ప

పద్మశాలీలకు అండగా ప్రభుత్వం


విజేతలకు బహుమతి అందజేస్తున్న చంద్రశేఖర్

మాజీ మంత్రి చంద్రశేఖర్

జహీరాబాద్: పద్మశాలీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం పట్టణంలో పద్మశాలీల 30వ వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే వల్ల బీసీల్లోని అన్ని కులాల వారికి సమన్యాయం జరుగుతుందన్నారు. అందరికీ ప్రభుత్వ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు జనార్దన్, కండెం నర్సింహులు, రాములునేత, రాజ్‌కుమార్, శేఖర్, సాంసన్, రాచయ్య, మొయిజ్, ఇనాయత్, పద్మశాలి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం


హరిషిక్ రెడ్డి (ఫైల్)

సంగారెడ్డి క్రైమ్: విద్యార్థి అదృశ్యమైన సంఘటన పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. సీఐ రమేష్ కథనం ప్రకారం.. సంగారెడ్డి పట్టణంలోని బ్రహ్మణవాడకు చెందిన జ్వాలా వాణిశ్రీ కుమారుడు జ్వాలా హరిషిక్ రెడ్డి (20) , నర్సాపూర్ శివారులోని బీవీఆర్ఐటీ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. ఈ నెల 8న మధ్యాహ్నం కాలేజీలో ప్రాజెక్టు వర్క్ సబిమ్మిట్ చేయాలని చెప్పి వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పనికి వెళ్తున్నానని చెప్పి..

పటాన్‌చెరు టౌన్: పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్ చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కోటేశ్వర రావు కథనం ప్రకారం.. ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర కాలనీకి చెందిన శ్రీనివాస్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఏడు సంవత్సరాల క్రితం వివాహం జరగగా.. నాలుగు సంవత్సరాల క్రితం భార్యతో విడాకులు తీసుకున్నాడు. అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జనవరి 18న పని నిమిత్తం అడ్డాపైకి వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. అయితే శ్రీనివాస్ మూడు నెలలు క్రితం ఇలాగే ఎవరికి చెప్పకుండా వెళ్లి.. పది రోజుల తర్వాత ఇంటి వచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు వస్తాడని ఎదురు చూశారు. శ్రీనివాస్ రాక పోవడంతో అతని సోదరుడు నాగరాజు పటాన్ చెరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడె, పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


శ్రీనివాస్ (ఫైల్)